


వాయిస్తే కొడుకు పాటలు పాడడం ఒక విచిత్రమైన వేడుక. పోనీ ఆ పాటలేమైనా కొత్తవా, తెలుగు పాటలా అంటే అవీ కాదు. భాష అర్థమై చావదు. అందులో పాత బాణీలు. ఇప్పుడు ఇంట్లోకి ఆ రికార్డులు మోసుకుని వచ్చి ఒహాటే సర్దుకోవడం, టేపుల్లోకి ఎక్కించడం. "అన్నం వడ్డించేను చల్లారి పోతుందనో, ఆఫీసు టైమ్ అవుతోందనో హెచ్చరించ లేక 'చస్తున్నాను" అనుకుంటూ ఉంటుంది రాజ్యలక్ష్మి.

ఒక ఉదయం వీధి తలుపు మీద టక్ టక్‌మని కొట్టిన చప్పుడు. తలుపు తీసి కెవ్వుమని అరవబోయి తమాయించుకుంది రాజ్యలక్ష్మి. "ఏం తల్లీ, ఇది రామా రావు అంటే, రాంబాబు ఇల్లే కదూ" అని అడిగి, కాస్త చనువుగా "ఉదయం పూట వేళకు అన్నం వండి పెట్టడం లేదా? అమ్మాయీ ఎందుకు రోజూ ఆలశ్యంగా వస్తున్నాడీ మధ్య" అన్నాడు హడావిడిగా వచ్చిన శ్యామ సుందరం. రోజూ రాంబాబు వ్యవహారం గ మనిస్తున్న రాజ్యలక్ష్మి ఇలాంటిదేదో జరుగుతుందని ఊహిస్తూనే ఉంది. జరగాలని కోరుకుంటూనే ఉంది కూడా. "రండి బాబాయ్ గారూ. ఆ గదిలో చూడండి ఆయన వాలకం. ఎప్పుడో భోజనం చెయ్యడం అయిపోయింది. ఆఫీసుకు వెళ్ళబోతూ ఏదో సవరింపులూ.. గ్రామఫోను రికార్డులూ.. టేపులూ..." అని మరికాస్త వేడెక్కించింది-ఎంతో ఆనందంగా.

శ్యామ సుందరం నములుతున్న మసాలా కిళ్ళీ నోటిలో ఒక ప్రక్క నుండి ఇంకో ప్రక్కకు సర్దుకుంటూ "ఏం పాటలోయ్ అవి..." అన్నాడు మిడిగుడ్లు పెద్దవి చేస్తూ. ఈ అనుకోని పరిణామానికి కలవరపడ్డ రాంబాబు "అబ్బే-ఏమీ లేదండీ, ఏవో మా నాన్న గారి పాత గ్రాం ఫోన్ రికార్డులు..." అని నసిగేడు. 'అవేవో చెప్పి ఏడవరాదూ' అని అడగ్గానే "కానన్ దేవీ, సురేందర్, కె.సీ.డే,... సైగల్, పంకజ్ మల్లిక్,... జగ్‌మోహన్... కుర్షీదీ..." అంటూ ఏకరువు పెడుతున్నాడు రాంబాబు. ఒక్కొక్క పేరు వింటూ కనుబొమలు సర్కస్ చేయిస్తూ ఆయాసంతో రొప్పుతున్నాడు శ్యామ సుందరం. అతని ముక్కు పుటాలు కూడా ఎగురుతున్నాయి. రాజ్యలక్ష్మికి అది కోపమో, తాపమో ఆవేశమో పూనకమో అర్థం కాకుండా ఉన్న క్షణంలో "తప్పదియ్యా-నీ ఇల్లు బంగారం గానూ... చెప్పి చావవేం. ఇంత విలువైన బంగారం రాశులు పోసుకుని నాకు చెప్పవేమిటోయ్. నేను ఈ పాటలంటే పడి చస్తానమకో. అసలు ఈ పాటలు రిలీజ్ అయిన రోజుల్లో నువ్వు మా కడుపున కాదు కదా, ఆమె ఊహల్లోనైనా ఉన్నావా?... భలే... ఏమి టేస్టోయ్ మీ నాన్న గారిది..." అని రాంబాబుని అమాంతం కౌగలించు కుని ఉకికరి బిక్కిరి చేశాడు. రాంబాబు కొండెక్కినంత సంతోషంతో "మా నాన్న గారు యూ.పి.లో చక్కెర ఫాక్టరీలో చాలా కాలం పని చేశారండీ. ఆయనకి హిందీ ఉర్దూ బాగా వచ్చు. గొంతుగ కూడా బాగుండేది..." అని జవాబిచ్చాడు.

ఆనందాన్ని సమంగా పంచుకోవడం వాళ్ళ ఇద్దరి వంతూ, అసూయ పడడం రాజ్యలక్ష్మి వంతూ అయింది. రాంబాబూ శ్యామ సుందరాలు కలిసి మెలసి తిరగడం, పది నిముషాలైనా ఆలశ్యంగా తరుచూ ఆఫీసుకు పోవడం చూసి విస్తు పోవడం అందరి వంతూ అయింది.

—గిడుగు రాజేశ్వర రావు

---

## 'సత్యాగ్రహం' పదపుంజం సత్యగాథ


అత్యంత శక్తివంతమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్నే గడగడలాడించుటకు అత్యద్భుత సాధనంగా ప్రయోగింపబడింది సత్యాగ్రహం.

ఈనాడు ఆ పదం ప్రయోగింపబడుతున్న తీరు తెన్నులు విచారకరంగా వున్నాయి.

పరీక్షలు వాయిదా వేయమంటూ సత్యాగ్రహం, తమ అభిమాన హీరో చిత్రాన్ని పాడిగించమంటూ సత్యాగ్రహం, దూరదర్శన్‌కు వ్యతిరేకంగా సత్యాగ్రహం, హోటళ్ళలో తినుబండారాల రేట్లు తగ్గించాలని, కావలసిన చోట ఆర్.టి.సి. బస్సులను ఆపాలని ఇలా ఎన్నో కోరికల సాధన కోసం సత్యాగ్రహాలు ప్రతి నిత్యం జరుగుతున్నాయి. అకృత్యాలను కూడా నిజాలుగా చాటాలన్న లక్ష్యంతో సత్యాగ్రహ తంత్రాలను అనుసరిస్తున్నారు.

ప్రపంచ చరిత్రలోనే వినూత్న అధ్యాయాన్ని సృష్టించిన గాంధీజీ 'సత్యాగ్రహము'ను ఆవిష్కరించిన తీరు ఇలా వుంది.

దక్షిణ ఆఫ్రికాలో తెల్ల వారి దౌర్జన్యాలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా, సత్యమే ఆధారంగా శాంతియుతమైన ఆందోళనకు గాంధీజీ శ్రీకారం చుట్టిన కాలమది. ఆ ఆందోళనకు ఏం పేరు పెట్టాలన్న ఆలోచనతో గాంధీజీ తమ అనుయాయులను, మిత్రులను కోరారు. పెక్కు పేర్లు సూచింపబడినాయి. 'నిశ్శస్త్ర ప్రతీకార ఆందోళన' అన్న పేరును తాత్కాలికంగా ఆమోదించారు. కాని గాంధిజీకి ఆ పేరు అంతగా నచ్చలేదు.





తుదకు తమ 'ఇండియన్ ఒపీనియన్' వార పత్రికలో సముచితమైన పేరును సూచింపమని కోరుతూ గాంధీజి ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటనలో "శాంతియుతమైన నా ఆందోళనకు సరైన, సామాన్యులు కూడా సులువుగా వుచ్చరించదగిన, అర్థవంతమైన, అందమైన పదాన్ని సూచించిన వారికి తగు బహుమతి ఇవ్వబడును" అన్నారు. ప్రకటన వెలువడిన వెంటనే కుప్పలుగా జాబులు వచ్చాయి. ఆ జాబులన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి, వాటి నుంచి పది పేర్లను ఎంపిక చేయవలసినదిగా గాంధీజీ ఇద్దరు ప్రముఖులను నియమించారు. అయిదు రోజులు శ్రమించి పది పేర్ల పట్టికను గాంధీజీకి అందజేశారు. ఆ పేర్లలో ఏ ఒక్కటీ గాంధీజికి తృప్తికరం కాలేదు.




చివరికి మదన్‌లాల్ గాంధీ సూచించిన 'సదాగ్రహం' అన్న పదం కొంతవరకు నచ్చింది. ఆ పదమే కొద్ది మార్పుతో 'సత్యాగ్రహం'గా రూఢి అయింది. భారత స్వాతంత్ర్య సమరంలో మహత్తర సాధనమైన పద పుంజంగా రూపొందింది 'సత్యాగ్రహం'.

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి




# సోషలిజం

రామనాథం రిక్షా దిగి గబగబా ''బుక్ స్టాల్'' కేసి నడిచాడు. రెండు తెలుగు దినపత్రికలు, ఒక యింగ్లీషు దినపత్రిక, ఓ రెండు తెలుగు వార పత్రికలు, ఓ సినిమా వారపత్రిక, ఓ ఆంగ్ల పక్షపత్రిక, ఒక తెలుగు మాస పత్రిక కొనేశాడు. అతని తీరే అంత! చేతిలో డబ్బుండాలే కాని రోజూ ఇదే తంతు!

రామనాథం ప్లాటుఫారం మీదకు వచ్చాడు. గుంటూరునుంచి బెజవాడ పోయే రైలు బయలుదేరు దానికి సిద్ధంగా వుంది. బండెక్కి కూర్చున్నాడు. అంతలో బండి బయలుదేరింది.

సిగరెట్టు ముట్టించి పేపర్ల కట్ట తెరిచాడు. తెరిచాడో లేదో ప్రక్కన కూర్చున్న పెద్ద మనిషి 'పేపర'డిగాడు. రామనాథం ఇచ్చాడు. ఈ ప్రక్కన కూర్చున్నవాడు ఇంకో పేపరడిగాడు. ఇచ్చాడు.

''ఏమండీ ఆ వార పత్రిక యిస్తారా- దయచేసి- 'ఫలానా' సీరియల్ కాస్త చదివిస్తాను'' అన్నది ఓ యిల్లాలు.

''ఫలానా లాటరీ రిజల్ట్సు పడేది ఈ రోజే! కాస్త ఆ 'షీటు' యిప్పించండి'' -ఓ పజిల్సు పిచ్చగాడు.

''వార ఫలాలు చూసిస్తాను- ఈ వారం మన జాతకం యెలా వుందో! ఆ వారపత్రిక యిప్పించండి బాబూ'' -ఓ ముసలాయన.

''ఆ మాస పత్రిక ఒకసారి యిస్తారా- ఈ నెలలో యే మినీ నవల వచ్చిందో చూసిస్తాను'' -ఓ మధ్యవయస్కురాలు.

''ఉద్యోగ ప్రకటనలు చూసిస్తాను. ఆ ఇంగ్లీషు పేపరొకసారివ్వండి''- ఓ నిరుద్యోగి.

''ఆ సినిమా వారపత్రిక ఇస్తారా? బొమ్మలు చూసిస్తాను'' ఓ అమ్మాయి.

''బోఫోర్స్ ముడుపుల గురించి వ్రాసినట్లుంది- ఈ ఇంగ్లీషు పక్ష పత్రిక ఇవ్వండి చూసిస్తాను'' -ఓ సూట్‌వాలా.

ఇలా తలా ఒకరు తలా ఒక పేపరడిగి తీసేసుకున్నారు. రామనాథానికి మతిపోయింది: పేపర్లు తనవి. తను కొనుక్కున్నాడు డబ్బిచ్చి- చదవడానికే కదా! వాళ్ళకున్న ఆదుర్దా తనకు మాత్రం వుండదా పేపరు చదవాలని! ఇన్ని కొన్నా ఒక్క పేపరూ తన వద్ద లేదు. మథనపడ్డాడు. లోపల కోపమొచ్చింది- అయితే తమాయించుకున్నాడు.

బండి నంబూరు స్టేషను దాటింది. పేపర్లు, వారపత్రికలు చేతులు మారిపోతున్నాయి. పేపర్లు అసలు మరలా తన చేతికొస్తాయా? అనుమానం వచ్చింది. చిర్రెక్కింది. ఉండబట్టలేక ఆవేశంతో అడిగాడు ప్రక్కనున్న పెద్దమనిషిని పేపరిమ్మని. పలుకలేదు. ఈ ప్రక్కనున్న అతన్ని అడిగాడు 'ఇస్తామండంఢీ'' అని విసుక్కున్నాడతను. వాళ్ళిద్దరి చేతుల్లో పేపర్లు లాక్కోవడానికి ప్రయత్నించాడు రామనాథం.

''ఏమిటండీ ఈ తొందర. చదువుతున్నాగా. మీ పేపరు మీకివ్వకుండా పోతామనా భయం?'' అన్నాడు పెద్దమనిషి.

''ఇంతలో మీ బంగారం మేమేం పట్టుకు పోములే'' రెండవ అతని ఈసడింపు.

బండి మంగళగిరి దాటిపోయింది! రామనాథానికి సహనం చచ్చిపోయింది. కడుపు మండిపోతోంది. రెచ్చిపోయాడు. పిచ్చిగా ఒకసారి పెద్దగా అరిచాడు.

''మాడండీ! నా పేపర్లు నాకు తిరిగి మర్యాదగా ఇస్తారా లేదా?'' ఒక్క క్షణం అంతా నిశ్శబ్దం. మళ్ళీ పెద్దగా అన్నాడు రామనాథం ''పేపర్లు నావి. డబ్బిచ్చి కొనుక్కున్నాను, చదువుకోవడానికి. పేపర్లు చదవ డానికి మీకెంత ఇంటరెస్టు, ఆదుర్దా వుందో నాకూ అంతే వుంది. ఏం మీరు కొనుక్కోలేరా? పేపరు కొనే తాహతు మీకు లేదా? అందరూ బాగా వున్నవాళ్ళలాగే వున్నారే. తిండికి లేనివాళ్ళు కాదుగా- ఏమిటి మీకీ దౌర్భాగ్యం- ఏమో ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుందో! నా పేపర్లు నాకు మర్యాదగా ఇస్తారా లేదా-'' మళ్ళీ గట్టిగా అడిగాడు.

ఒకళ్ళిద్దరు తిరిగిచ్చేరు పేపర్లు. అంతలో ఒకడు వుద్రేకంగా ''ఏం- యివ్వం- ఏం చేస్తావ్? కొడతావా,

చంపుతావా?'' అంటూ ప్రక్క మనిషి చేతిలో పత్రిక లాక్కొని చింపి రామనాథంకేసి విసిరాడు. మొహం మీద పడింది అది. మిగిలినవాళ్ళూ రుసరుస లాడుతూ పేపర్లు పత్రికలు రామనాథం మొహంకేసి విసిరికొట్టారు.

రైలు తాడేపల్లి స్టేషను దాటింది.

''మీరు మనుషులా పశువులా- బుద్ధుందా లేదా! నా పేపర్లు నా కివ్వమంటే విసిరికొడతారా! చింపి పారేస్తారా'' ఆవేశంతో వూగిపోతున్నాడు రామనాథం.

పరిస్థితి విషమించింది. ఆవేశాలు ఆగ్రహాలు పెరిగిపోయాయి. రామనాథం మీదమీదికి వచ్చేరు యిద్దరో ముగ్గురో. రామనాథం కూడా ఎదురు వెళ్ళాడు. ఒకరినొకరు దుర్భాషలాడుకోవడం, ఒకరి మీదికి ఇంకొకరు పోవడం, చేయి చేయి పట్టుకోవడం, చివరకు చొక్కాలు గుంజుకోవడం వరకు వెళ్ళింది.

రైలు కృష్ణా బ్రిడ్జి మీదికొచ్చింది. దబడబా శబ్దం. రైలు పెట్టెలో దెబ్బలాడుకోవడం! ఏం జరుగుతుందో ఎవరికీ తెలియడం లేదు. అంతా అరుపులే! ఇంతలో ఎవరో పెద్దాయన కలుగజేసుకుని అందర్నీ సర్దాడు.

రైలు బ్రిడ్జి దాటింది. అంతా నిశ్శబ్దం. చూస్తే రామనాథం చొక్కా చిరిగుంది! దిగాలుపడిపోయినా ఏదో గొణుగుతున్నాడు! తిడుతున్నాడు!

ఇంతలో గొలుసు లాగేరెవరో! బండి ఆగింది. గబగబా అందరూ దిగిపోతున్నారు. ఆ పెద్దాయన రామనాథంతో ''చూడు బాబు! కాలం మారి పోయింది. 'నాది' అనే రోజు పోయే రోజులొచ్చాయి! న్యాయమెక్కడ! త్వరలోనే వున్నవాళ్ళ ఇళ్ళల్లోకి లేని వాళ్ళు జొరబడి దోచుకొని పైగా చంపేస్తామని బెదరించే రోజులొస్తాయేమో... ఏమీ బాధపడకు బాబు'' అంటూ దిగిపోయాడు.

రామనాథం ఆ పెద్దాయనకేసి అదోలా చూస్తుండి పోయాడు!

—అమూల్యశ్రీ

## భాస్వరం

ఎల్.ఆర్.ఈశ్వరి చలనచిత్ర సీమలో ఉజ్వలంగా వెలుగుతున్న రోజులు అవి. ఆ రోజుల్లో ఓ చలన చిత్ర శతదినోత్సవ సభకు డాక్టర్ సి.నారాయణరెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించేరు. ఆయన ఎల్.ఆర్.ఈశ్వరిని వేదికపైకి ఆహ్వానిస్తూ—

''స్వరంలో 'భాస్వరం' వున్న ఎల్.ఆర్. ఈశ్వరి'' అంటూ చమత్కరించేరు.

—మాలిని